క్లుప్తంగా

ఎల్లారెడ్డి ఆర్డీవోగా మన్నె ప్రభాకర్



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి ఆర్డీవోగా మన్నె ప్రభాకర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎల్లారెడ్డి ఆర్డీవోగా ఉన్న రాథోడ్ రమేశ్ జనగామకు బదిలీ కాగా ఆయన స్థానంలో హైద్రాబాద్‌లోని సీసీఎల్‌ఏ కమిషనర్ కార్యాలయం నుంచి పదోన్నతిపై మన్నె ప్రభాకర్ ఎల్లారెడ్డి ఆర్డీవోగా బదిలీపై వచ్చారు. బదిలీపై వచ్చిన ఆర్డీవోను సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

తహసీల్దార్‌గా సురేష్



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి తహసీల్దార్‌గా సురేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎల్లారెడ్డి తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించిన సుధాకర్ బదిలీ కాగా ఆయన స్థానంలో కామారెడ్డి జిల్లా బీర్కూర్ నుంచి బదిలీపై వచ్చారు.

బాన్సువాడ తహసీల్దార్‌గా వరప్రసాద్



బాన్సువాడ: బాన్సువాడ తహసీల్దార్‌గా వరప్రసాద్ సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. బోధన్ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన వరప్రసాద్ బదిలీపై బాన్సువాడగా వచ్చారు. బాన్సువాడలో పని చేసిన గంగాధర్ బోధన్‌కు బదిలీ అయ్యారు. జుక్కల్‌లో డిప్యూటీ తహసీల్దార్‌గా ఉన్న గంగాప్రసాద్ బాన్సువాడ డిప్యూటీ తహసీల్దార్‌గా బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు.

కాంగ్రెస్ రాష్ట్ర మైనార్టీ జనరల్ సెక్రెటరీగా రఫీయోద్దిన్



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి చెందిన రఫీయోద్దీన్‌ను రాష్ట్ర మైనార్టీ జనరల్ సెక్రెటరీగా సోమవారం నియమించినట్లు రాష్ట్ర మైనార్టీ అధ్యక్షుడు సోహెల్ ప్రకటించారు. ఆయనకు రాష్ట్ర ఐటీ సెల్ చైర్మన్, ఉపాధ్యక్షుడు మదన్‌మోహన్‌రావు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. నాయకులు సాజిద్, జొన్నల రాజు, అజార్, తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): వెంకంపల్లి గ్రామ పద్మశాలి సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మాసిని భూషణం, ఉపాధ్యక్షుడిగా మాసిని నర్సింలు, కార్యదర్శిగా మాసిని రమేష్, సంయుక్త కార్యదర్శిగా మాసిని సత్యనారాయణ, కోశాధికారి మాసిని మోహన్, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా భట్టు భూషణంలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

'గృహలక్ష్మి' వివరాల సేకరణ



భిక్కనూరు: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో గృహలక్ష్మి కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల వివరాలను సేకరించి పరిశీలించే కార్యక్రమాన్ని సోమవారం నుంచి ప్రారంభించారు. దరఖాస్తుదారుల స్థితిగతులపై సర్వే నిర్వహించారు.

అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు సన్మానం



భిక్కనూరు: రాష్ట్రస్థాయిలో ఉత్తమ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ప్రశంసలు పొందిన కామారెడ్డి అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ నంద రమేశ్‌ను భిక్కనూరు మండల కేంద్రంలో దొమకొండ మండల ముదిరాజు సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శాలువా, మెమెంటోలతో సత్కరించారు. కార్యక్రమంలో దోమకొండ పెద్దమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు పున్న లక్ష్మన్, నేతలు పున్న రాములు, కొండ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బాలికల విద్యపై ప్రత్యేక శ్రద్ధ

- విజన్ ఉన్న నాయకుడు సీఎం కేసీఆర్
- విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి



మాట్లాడుతున్న మంత్రి సబిత.. పక్కన ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే సింధే, జెడ్పీ చైర్‌పర్సన్ శోభ

నిజాంసాగర్/పెద్దకొడప్‌గల్(జుక్కల్): కేజీ నుంచి పీజీ వరకు గురుకులాల్లో ఉచిత విద్యను అందించడం ప్రభుత్వ లక్ష్యమని, సీఎం కేసీఆర్ విజన్ ఉన్న నాయకుడని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. గురుకులాల్లో ఆణిముత్యాలాంటి పిల్లలను తయారు చేయడం, విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యతను వెలికి తీయడం ఉపాధ్యాయుల బాధ్యత అన్నారు. సోమవారం కామారెడ్డి జిల్లా పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంలో మన ఊరు–మన బడి కార్యక్రమం కింద అదనపు తరగతి గదులను జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్‌సింధే, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ ఆధ్వర్యంలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మన ఊరు–మన బడి కార్యక్రమం కింద ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలు మారుతున్నాయన్నారు. 2014–15 ఆర్థిక సంవత్సరంలో విద్యా శాఖకు రూ.9 వేల కోట్ల బడ్జెట్ కేటాయించగా.. ఈ ఏడాది రూ.29 వేల కోట్లు కేటాయించారని పేర్కొన్నారు. బాలికల కోసం 600 గురుకులాలను ఏర్పాటు చేశామని చెప్పారు. గురుకుల పాఠశాలల్లో ఒక్కొక్క విద్యార్థికి ఏడాదికి రూ.1.2 లక్షల చొప్పున ప్రభుత్వం ఖర్చు చేస్తోందన్నారు. ఇప్పటి వరకు రూ.7 వేల కోట్లు ఖర్చు చేసి పాఠశాలలను బాగు చేశామని వెల్లడించారు. నిజాంసాగర్ మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరైందని తెలిపారు. పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంలో వచ్చే విద్యాసంవత్సరానికి జూనియర్ కళాశాలను ఏర్పాటు చేసేలా కృషి చేస్తానని చెప్పారు. అనంతరం ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే హన్మంత్ సింధే, ఎమ్మెల్సీ రఘోత్తం, జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ మాట్లాడారు. సీఎం కేసీఆర్ కృషితో జుక్కల్ నియోజకవర్గంలో నాలుగు గురుకుల పాఠశాలలు మంజూరయ్యాయని అన్నారు. మన ఊరు –మన బడి చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, విద్యాశాఖ ప్రిన్సిపల్ డైరెక్టర్ దేవసేన, అదనపు కలెక్టర్ మనుచౌదరి, ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు, డీఈవో రాజు, ఎంఈవో దేవిసింగ్ తదితరులు ఉన్నారు.

'బీజేపీ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి'



మాట్లాడుతున్న బీజేపీ ఎమ్మెల్యే కల్యాణ్ శెట్టి

మాచారెడ్డి: బీజేపీ కార్యకర్తలు రాబోయే ఎన్నికల్లో సైనికుల్లా పనిచేసి బీజేపీని అధికారంలోకి తీసుకురావాలని మహారాష్ట్రలోని అక్కల్‌కోట్ ఎమ్మెల్యే సచిన్ కల్యాణ్ శెట్టి పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే ప్రవాస్ యోజన వర్క్‌షాప్‌లో భాగంగా సోమవారం ఎలుపుగొండలోని వెలమ ఫంక్షన్ హాలులో నిర్వహించిన మాచారెడ్డి, పాల్వంచ మండలాల కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. పార్టీని కింది స్థాయిలో అన్ని వర్గాల వారికి చేరువ చేయడానికి తీసుకోవలసిన చర్యల గురించి వివరించారు. జిల్లా అధ్యక్షులు అరుణతార మాట్లాడుతూ.. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కామారెడ్డి అసెంబ్లీ సీటు కచ్చితంగా బీజేపీదేనని జోస్యం చెప్పారు. కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. ప్రతి కార్యకర్త ప్రధాని నరేంద్ర మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గడప గడపకు తెలియజేయాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షుడు పొన్నాల వెంకటరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ కుంట లక్ష్మారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి తేలు శ్రీనివాస్, తదితరులున్నారు.

సంక్షేమ హాస్టళ్ల సమస్యల్ని పరిష్కరించాలి



కామారెడ్డి టౌన్: జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్ చంద్రమోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ అలోఫ్ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల నిధులు రూ. 5177 కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఖాళీ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాస్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గ్రామీణ ప్రాంత ప్రజలు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్ అన్నారు. జప్తిజాన్కంపల్లిలో సోమవారం రాత్రి కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పోలీస్ సిబ్బంది కార్డన్ సెర్చ్ చేపట్టారు. గ్రామంలోని ప్రతివాహనానికి సంబంధించిన ధ్రువపత్రాలను వారు తనిఖీ చేశారు. 30 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రతా నియమాలను పాటించాలన్నారు. ఎల్లారెడ్డి సీఐ శ్రీనివాస్, నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి, లింగంపేట ఎస్సైలు రాజు, గణేష్, ప్రభాకర్, గ్రామసర్పంచ్ దేశబోయిన సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం



పెద్దకొడప్‌గల్(జుక్కల్): ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని అదనపు ఎస్పీ నరసింహారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని,ప్రతి ఒక్కరూ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ జగన్నాథ్ రెడ్డి, సిఐ కృష్ణ, ఎస్సై కోనా రెడ్డి, సర్పంచ్ తిర్మల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాను సరిచూసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న ఆర్డీవో భుజంగ్‌రావు

బాన్సువాడ రూరల్: ఓటరు జాబితాను ప్రదర్శించామని వాటిలో ఏమైనా తప్పులుంటే సవరించుకోవాలని బాన్సువాడ ఆర్డీవో భుజంగ్‌రావు తెలిపారు. సోమవారం ఆయన మండల కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. త్వరలో ఎన్నికలు రానున్న నేపథ్యంలో అన్ని పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన డ్రాఫ్ట్‌రోల్ పబ్లిష్ చేశామన్నారు. జాబితాలో ఏమైనా అభ్యంతరాలుంటే తెలపాలన్నారు. కొత్తవారు దరఖాస్తు చేసుకోవచ్చని, అడ్రస్ మార్పునకు కూడా అవకాశం ఉందన్నారు.

బీఆర్ఎస్ నాయకుల సంబురాలు



ఎల్లారెడ్డి ఎమ్మెల్యే సురేందర్‌కు టికెట్ కేటాయించడంతో లింగంపేటలో సంబురాలు



స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి కేటాయించినందుకు బాన్సువాడలో..

సాక్షి నెట్‌వర్క్: జిల్లాలోని సిట్టింగ్ ఎమ్మెల్యేలు హన్మంత్ సింధే(జుక్కల్), జాజాల సురేందర్(ఎల్లారెడ్డి), పోచారం శ్రీనివాస్ రెడ్డి(బాన్సువాడ)లకు బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ మళ్లీ టికెట్లు కేటాయించడంతో స్థానిక బీఆర్ఎస్ నేతలు ఆయా నియోజకవర్గాల్లో సంబురాలు చేసుకున్నారు. టపాకాయలు కాల్చి సంతోషం వ్యక్తం చేశారు. అలాగే సీఎం కేసీఆర్ కామారెడ్డి నియోజకవర్గం నుంచి పోటీ చేయడంపై ఆనందం వ్యక్తం చేస్తూ సంబురాలు నిర్వహించారు.



ఎమ్మెల్యే హన్మంత్ సింధేకు కేటాయించినందుకు పిట్లంలో ..



కేసీఆర్ కామారెడ్డి నుంచి పోటీ చేస్తున్నందుకు..

ఉద్యమ స్థాయిలో 'ఉన్నతి లక్ష్యం' చేపట్టాలి



కామారెడ్డి టౌన్: జిల్లాలో ఉద్యమ స్థాయిలో ఉన్నతి లక్ష్య కార్యక్రమాన్ని చేపట్టాలని రాష్ట్ర పరిశీలకులు శ్రీనాథ్ సూచించారు. సోమవారం దేవునిపల్లిలో ప్రారంభమైన జిల్లా స్థాయి ప్రధానోపాధ్యాయుల మూడు రోజుల శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రాథమికోన్నత పాఠశాల్లో విద్యార్థుల్లో అభ్యాసన అభివృద్ధి కార్యక్రమం సమర్థంగా అమలు చేయాలని సూచించారు. కార్యక్రమ అకడమిక్ మానిటరింగ్ అధికారి వేణుగోపాల్ మాట్లాడుతూ.. జిల్లాలో ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం ఎంత సమర్థంగా జరుగుతుందో అంతకంటే సమర్థంగా ఉన్నత పాఠశాలలలో కూడా గుణాత్మక విద్యను అందజేసి ఉత్తమ ఫలితాలను సాధించాలని కోరారు. జిల్లా పరీక్షల బోర్డు కార్యదర్శి బలరాం, పరీక్షల నిర్వహణ అధికారి లింగం, సమన్వయకర్త వెంకట రమణారావు, తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్ల పరిశీలన

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ధర్మారెడ్డి గ్రామం నుంచి వెంకంపల్లి బ్రిడ్జి వరకు వేసిన రోడ్డుతోపాటు మండలంలోని మాల్తుమ్మెద నుంచి లింగంపేట మండలం మెంగారం వరకు వేసిన బీటీ రోడ్లను సోమవారం హైద్రాబాద్‌కు చెందిన ఆర్అండ్‌బీ సీఈ సతీష్ పరిశీలించారు. ఏడేళ్లు గడిచినా ధర్మారెడ్డి– వెంకంపల్లి రోడ్డు పనులు పూర్తికాకపోవడంతోపాటు మాల్తుమ్మెద–మెంగారం రోడ్డు పనులు సైతం అసంపూర్తిగా ఉండడంతో జిల్లా ఆర్ అండ్‌బీ అధికారులపై ఆయన మండిపడ్డట్లు తెలిసింది. పనుల్లో సైతం నాణ్యత కొరవడినట్లు ఆయన గుర్తించారు. నిలిచిన రోడ్డు పనులు వెంటనే పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఆర్అండ్‌బీ ఎస్ఈ నాగేశ్వర్‌రెడ్డి, క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈ పుల్లాదాస్, ఈఈ రవిశంకర్, డీఈఈ మోహన్, ఏఈ శ్రీకాంత్ ఉన్నారు.

కొనసాగుతున్న ఏఎన్ఎంల సమ్మె



కామారెడ్డి టౌన్: తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఏఎన్ఎంలు చేపట్టిన సమ్మె కొనసాగుతుంది. సీఐటీయూ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ముందు చేపడుతున్న సమ్మెలో సోమవారం ఏఎన్ఎంలు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ప్రభుత్వం కళ్లు తెరిచి తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరణ చేయాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ, మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏఎన్ఎంలు సమ్మెలో కూర్చున్నారు. బీఎస్పీ, ఆప్ నేతలు సమ్మెకు మద్దతు తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఏఎన్ఎంలకు న్యాయం చేయాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బట్టింకి బాల్‌రాజు డిమాండ్ చేశారు.

'కేసీఆర్‌పై తిరగబడి తరిమికొడతాం'



కామారెడ్డి టౌన్: కామారెడ్డిలో పోటీ చేయనున్న సీఎం కేసీఆర్‌ను ప్రజలు తిరగబడి తరమికొట్టడం ఖాయమని డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు విమర్శించారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. మాజీ మంత్రి షబ్బీర్ అలీ చేతిలో కేసీఆర్ ఓడిపోవడం ఖాయమని అన్నారు. గజ్వేల్‌లో కేసీఆర్ ఓడిపోతాడని భయంతోనే కామారెడ్డిలో సైతం పోటీ చేస్తున్నారని అన్నారు. నాయకులు గూడెం శ్రీనివాస్ రెడ్డి, గోనె శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు .

నేడు తాడ్వాయికి ఎమ్మెల్యే రాక

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి మంగళవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేంద ర్ విచ్చేయనున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్య క్షుడు మద్ది మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గోపాల్‌రావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు.

ఘనంగా నాగుల పంచమి



పిట్లంలో పూజలు చేస్తున్న మహిళలు



గాంధారిలో భోగేశ్వరాలయంలో పుట్టలో పాలు పోస్తున్న మహిళలు

సాక్షి నెట్‌వర్క్:జిల్లాలో సోమవారం నాగుల పంచమి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే ఆలయాలకు క్యూ కట్టారు. దైవ దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండుగ ఆచారం ప్రకారం పుట్టల్లో పాములకు పాలు పోసి మొక్కుకున్నారు. అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా సోదరీమణులు తమ సోదరులకు ఆవుపాలతో కళ్లను కడిగారు. అనంతరం సోదరులు తమకు తోచిన విధంగా కట్నకానుకలు అందజేశారు.



తాడ్వాయిలో ఆవు పాల కోసం క్యూ



పుట్టలో పాలు పోస్తున ఉగ్రవాయి సర్పంచ్ జుకంటి సుమిత



నస్రుల్లాబాద్‌లో..

శేష జీవితం ఆనందంగా గడపాలి

- వయోవృద్ధుల దినోత్సవంలో జిల్లా న్యాయమూర్తి శ్రీదేవి



సన్మానిస్తున్న సీనియర్ సిటిజన్స్ ప్రతినిధులు

కామారెడ్డి అర్బన్: వయో వృద్ధులు తమ శేష జీవితం వీలైనంతగా ప్రశాంతంగా, ఆనందంగా గడపాలని, ఆహారం, ఆరోగ్యం పట్ల శ్రద్ధగా ఉండాలని జిల్లా న్యాయమూర్తి శ్రీదేవి అన్నారు. ప్రపంచ వయో వృద్ధుల దినోత్సవం సందర్భంగా సోమవారం కామారెడ్డి సీనియర్ సిటిజన్స్ జిల్లా ఫోరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆవరణలో మొక్కలు నాటి అనంతరం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వృద్ధులకు తమ సంతానం, ఇతరులతో ఆస్తి తగాదాలు, పోషణ సంబంధించిన వివాదాలు వచ్చినప్పుడు చట్టం కల్పించిన సౌకర్యాలను వినియోగించుకోవాలని సూచించారు. హెల్త్ కార్డులు తీసుకోవాలన్నారు. సీనియర్ న్యాయవాది బీఆర్ రమేశ్ చంద్ సీనియర్ సిటిజన్ల చట్టాలపై అవగాహన కల్పించారు. జిల్లా గ్రంథాయల సంస్థ చైర్మన్ పి.రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శి మారవేణి రాజన్న, వైద్యశాఖాధికారి లక్ష్మణ్‌సింగ్, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ విలీనం గొప్ప విషయం

- అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి



సూపర్ లగ్జరీ బస్సును ప్రారంభిస్తున్న స్పీకర్

బాన్సువాడ: బాన్సువాడ ఆర్టీసీ బస్ డిపోకు వచ్చిన కొత్త సూపర్ లగ్జరీ బస్సులను సోమవారం స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. బస్ డిపో నుంచి బస్టాండ్ వరకు స్పీకర్ బస్సులో ప్రయాణించారు. బస్‌డిపో ముందు నుంచి ప్రధాన రహదారి వరకు రూ.10 లక్షలతో నూతనంగా నిర్మించే సీసీ రోడ్డు పనులను కూడా ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం చారిత్రాత్మక నిర్ణయమని, ఇక నుంచి ఆర్టీసీ కార్మికులు కాదు ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణిస్తారని అన్నారు. ఆర్టీసీ డీఎం సరితాదేవి, నాయకులు ఎజాస్, అంజిరెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీధర్, పాత బాలకృష్ణ ఉన్నారు.

ఎన్నికల ముందే సమస్యలు పరిష్కరించండి



వినతి పత్రం అందజేస్తున్న టీటీయూ నాయకులు

కామారెడ్డి అర్బన్: శాసనసభ ఎన్నికలకు ముందే విద్య, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి విజ్ఞప్తి చేసినట్లు తెలంగాణ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండీ ముజీబొద్దీన్, కాంబే గోపాల్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దామోదర్ రెడ్డి, కుశాల్‌లు తెలిపారు. ఉపాధ్యాయ బదిలీలు, ప్రమోషన్లు, 317 జీవోతో స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులకు సొంత జిల్లాకు వెళ్లడానికి అవకాశం, పాత పెన్షన్ విధానం అమలు, పెండింగ్ బిల్లుల క్లియరెన్స్ తదితర సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం ఇచ్చినట్లు పేర్కొన్నారు.

బీజేపీ గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): బీజేపీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని కర్ణాటకలోని దావణగిరి జిల్లా హరిహర్ నియోజకవర్గం ఎమ్మెల్యే బీపీ హరీష్ పిలుపునిచ్చారు. ఎర్రాపహాడ్‌లో సోమవారం ఎమ్మెల్యే ప్రవాస్ యోజన వర్క్ షాపులో భాగంగా నిర్వహించిన బీజేపీ కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగురవేయాలని కోరారు. ఎల్లారెడ్డిలో ఈసారి బీజేపీ విజయం అందుకోవడానికి బూతు స్థాయిలో పటిష్టమైన ఏర్పాట్లను చేస్తున్నామని వివరించారు. నేతలు మర్రి రాంరెడ్డి, పైలా కృష్ణారెడ్డి, మర్రి బాపురెడ్డి పాల్గొన్నారు.

రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక

బాన్సువాడ: టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ నేత కాసుల బాల్‌రాజ్ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లో పలువురు బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తలు, నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి రేవంత్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి తీసుకొచ్చేలా ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేయాలని రేవంత్ రెడ్డి సూచించారు. నాయకులు మంత్రి గణేష్, హన్మాడ్లు, ఖలేక్, బండి సాయిలు తదితరులు ఉన్నారు.

